క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటిపాడు(గుంటూరు): 11 కేవీ విద్యుత్ లైన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ ఉండదని చెప్పారు. నలందనగర్, బృందావన్ గార్డెన్స్, రింగ్ రోడ్ వైపు వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తోన్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ప్రభాతసేవ, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, సహస్రనామార్చన నిత్య హోమం, మహా పూర్ణాహుతి, చూర్ణోత్సవం, చక్ర తీర్థ ఉత్సవం వంటి కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేళలో ధ్వజావరోహణ, దేవతో ద్వాసనం, శ్రీపుష్ప యాగం, పూలంగిసేవ, పవళింపు సేవ భక్తి ప్రపత్తులతో చేపట్టారు. భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్యానాయుడు, దాసరి భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ వార్షికోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల ఆవరణలో జరిగే వార్షికోత్సవ వేడుకలకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేత విజయవాడ బ్లూస్



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు రూరల్ పొత్తూరులోని అక్మే ఇంటర్నేషనల్ స్కూల్లో సోమవారం నిర్వహించిన ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో 14 జట్లకు చెందిన క్రీడాకారులు తలపడ్డారు. అయితే అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజయవాడ బ్లూస్ జట్టు విజేతగా నిలిచి రూ.25 వేల నగదు బహుమతి కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో నిలిచిన గుంటూరు ఎఫ్‌సీ జట్టు రూ.20 వేల నగదు, తృతీయ స్థానంలో నిలిచిన ఎస్ఆర్ఎం వర్సిటీ జట్టు రూ.15 వేల నగదు బహుమతి గెలుపొందాయి. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ నందమూరి సౌగంధ్ కృష్ణ మాట్లాడుతూ యువతరం శారీరకంగా, మానసికంగా ఎదగడంలో క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. క్రీడలతో దేహ దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం చేకూరుతాయన్నారు. కార్యక్రమంలో గుంటూరు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు క్రాంతికుమార్, సంజీవని హాస్పిటల్స్ ఎండీ యడ్లపల్లి సుబ్రహ్మణ్యం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొమ్మల మండపం వద్ద ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఈ ఘటనపై వాహన యజమాని సోమవారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు మేక నరేంద్రరెడ్డి వివరాల మేరకు.. తాడేపల్లి మెయిన్ రోడ్డులోని బొమ్మల మండపం వద్ద పాత పోస్టాఫీస్ ఎదురుగా తన ఇంటి ఆవరణలో ఏపీ 37 బీయూ 7866 నంబరు గల బ్లాక్ కలర్ పల్సర్‌ను పార్క్ చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు తెల్లవారుజామున హ్యాండిల్ లాక్ తొలగించి ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. ఈ సంఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. తాడేపల్లి పట్టణ రూరల్‌లో గత కొంతకాలంగా ఇళ్ల ముందు, రోడ్లపై పార్కు చేసిన ద్విచక్ర వాహనాలు తరచు చోరీకి గురి అవుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో సుమారు 15 ద్విచక్ర వాహనాల వరకు చోరీకి గురి అయినట్లు సమాచారం. దొంగిలించిన వాహనాలపై ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని విమర్శలొస్తున్నాయి.

మంచి మనిషి మాణిక్యవేలు

తాడికొండ: పేదలకు ఉపాధి కల్పించిన మంచి మనిషి మాణిక్య వేలు అని, ఆయన మరణం కుటుంబంతో పాటు అందరికీ తీరని లోటు అని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. ఇటీవల మరణించిన ట్రిపుల్ ఎక్స్ సబ్బుల కంపెనీ అధినేత మాణిక్యవేలు కుమారుడు పర్వీన్ బాబు, కుటుంబ సభ్యులను ఆయన సోమవారం పరామర్శించారు. అనంతరం మాణిక్య వేలు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అంతర్గత బదిలీలపై వెనకడుగు!

- వర్క్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయాలని కమిషనర్ ఆదేశాలు
- బదిలీల ప్రక్రియ చేపట్టని ఇంజినీరింగ్ అధికారులు
- ఏఈలకు బినామీలుగా వ్యవహరిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు?

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు దశాబ్దాల తరబడి ఒకే స్థానంలో విధులు నిర్వహించడంతో వారి అవినీతికి అంతు పొంతు లేకుండా పోతుంది. రిజర్వాయర్ల పరిధిలో ట్యాప్ కనెక్షన్లు ఇచ్చే క్రమంలో భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఏఈలను కూడా తమ గ్రిప్‌లో పెట్టుకుని వారికి బినామీలుగా వ్యవహరిస్తూ కోట్లాది రూపాయల వర్కులు తూతూ మంత్రంగా చేపట్టి బిల్లులు ప్రాసెస్ చేయించుకుంటున్నా ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు స్పందించడం లేదు. వర్క్ ఇన్‌స్పెక్టర్లపై వస్తున్న ఆరోపణలపై కమిషనర్ పులి శ్రీనివాసులు, అంతర్గత బదిలీలు నిర్వహించాలని గతంలో ఆదేశించినా ఇంత వరకు బదిలీలపై ఇంజినీరింగ్ అధికారుల చర్యలు తీసుకోవడం లేదు.

సిఫార్సులతో బదిలీలు బ్రేక్..

నగరంలో రెండు వేలకు మందిపైగా వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ట్యాప్ వర్కర్లు పనిచేస్తున్నారు. వీరంతా ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పనిచేయడంతో ఆయా ప్రాంతంలో వీరు చెప్పిందే శాసనంగా మారింది. హెచ్ఎల్ఆర్ వాటర్ ట్యాంకులు, బీఆర్ స్టేడియం,



నగరపాలక సంస్థ కార్యాలయం

ఏటీ అగ్రహారం, ఎల్‌బీ నగర్ వాటర్, ఎల్ఎల్ఆర్ వాటర్ ట్యాంకులతో పాటు సర్కిల్ ఆఫీస్‌లతో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో వర్కు ఇన్‌స్పెక్టర్లు చెప్పిందే వేదం. ఇటు ఏఈల నుంచి అటు ఎమ్మెల్యేల వరకు కమీషన్లు తీసుకెళ్లి ఇచ్చేది వీళ్లే. వీరు చెప్పిన మాట ఏఈలు వినాల్సిన పరిస్థితి ఉందంటే వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాత్ర ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరు చేస్తున్న కమీషన్ సేవలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యేలు వారిని బదిలీలు చేయవద్దని సిఫార్సులు చేసినట్లు ఆరోపణలున్నాయి.

ట్యాప్ కనెక్షన్‌కు మామూళ్లు..

నగరపాలక సంస్థ పరిధిలో ట్యాప్‌లు వేయాలన్నా.. పొరపాటున ఆ ట్యాప్‌కు రిపేర్ వచ్చిన

కమిషనర్‌ను అడగండి...

వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ట్యాప్ వర్కర్ల బదిలీలపై కమిషనర్ బదిలీలు చేపట్టాలని ఎందుకు బదిలీ చేయడం లేదని నగరపాలక సంస్థ గత నెలలో ఎస్ఈని వివరణ కోరగా వార్డు ఎమినిటీ సెక్రటరీలకు ఇన్‌చార్జి ఏఈ పోస్టింగ్ ఇచ్చే ప్రక్రియ నడుస్తుందని... ఆ ప్రక్రియ పూర్తి కాగానే వీరి బదిలీలు చేపడతామని చెప్పారు. సోమవారం మరోసారి ఎస్ఈ నాగమల్లేశ్వరరావును సంప్రదించగా వర్క్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ విషయం నాకు తెలియదు. కమిషనర్‌ను అడగండి..ఆయన సంతకం పెట్టమంటే పెడతాను అన్నట్లుగా సమాధానం ఇచ్చారు.

వేలల్లో మామూళ్లు ఇస్తేనే సమస్యకు పరిష్కారం చూపుతారు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ట్యాప్ వర్కర్లు. గత కొద్ది నెలల క్రితం బీఆర్ స్టేడియం పరిధిలో ట్యాప్‌లు వేసేందుకు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఫిట్టర్ మజ్దూర్ అదనంగా డబ్బులు అడగడంతో కమిషనర్ సదరు ఉద్యోగిని విధుల్లో నుంచి తొలగించారు. కాని అక్కడి ఇంజినీరింగ్ అధికారి సదరు ఉద్యోగిని తిరిగి విధుల్లో కొనసాగిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అదే విధంగా గోరంట్ల పరిధిలో ట్యాప్ రిపేర్ చేసేందుకు ట్యాప్ వర్కర్ రూ.25వేలు డిమాండ్ చేయడంతో వారు ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి ఎటువంటి ఫలితం లేకుండా పోయింది.

అప్‌గ్రేడెడ్ హైస్కూళ్లకు ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న హైమారావు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరపాలక సంస్థలో అప్‌గ్రేడ్ అయిన హైస్కూళ్లకు గ్రేడ్–2 హెచ్ఎంతో పాటు, అన్ని సబ్జెక్టుల వారీగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేణుగోపాల్‌నగర్‌లో ఎన్‌టీఏ నగర శాఖ ద్వితీయ కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. హైమారావు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు లేక విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, గత పదేళ్లలో ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయక పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నగర శాఖ ప్రధాన కార్యదర్శి పి.లలితబాబు మాట్లాడుతూ గుంటూరు ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్లను అప్‌డేట్ చేయాలని కోరారు. సమావేశంలో సంఘ నగర అధ్యక్షుడు పి.సాయి విశ్వనాథ్, నాయకులు జి.సతీష్, కూరపాటి రాజా మాస్టారు, కేవీ రాఘవులు, ఏ హరగోపాల్, టి.శ్రీనివాస్, పి.చెంచయ్య, ఎస్. వెంకటేశ్వర్లు, ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

భగవద్గీతపై ఆధ్యాత్మిక ప్రవచనం



మాట్లాడుతున్న సువీరానందస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం శ్రీ మద్భగవద్గీత త్రయోదశ అధ్యాయంలోని క్షేత్రజ్ఞ విభాగ యోగం ప్రవచనం నిర్వహించారు. జరుబుల బంగారుబాబు, శివకుమారి దంపతుల సౌజన్యంతో జరగ్గా, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. చిన్మయమిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచిస్తూ క్షేత్ర, క్షేత్రజ్ఞుల తత్త్వములపై ఋషులెల్లరు పలు విధాలుగా వివరించారని అన్నారు. వివిధ వేద మంత్రాలను వేర్వేరుగా చెప్పారని పేర్కొన్నారు. బ్రహ్మసూత్ర పదాలు కూడా నిశ్చయాత్మకంగా, సహేతుకంగా తేటతెల్లం చేశారని అన్నారు. ద్వేషం, సుఖం, దుఃఖం, స్థూలశరీరం, చైతన్యం అను వికారాలతో కూడిన క్షేత్రస్వరూపం సంక్షిప్తంగా పరమాత్మే అన్నారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీ ఆవరణలో పొదలు తొలగింపు



సాక్షి
ఈఎస్ఐ డిస్పెన్సరీకి సుస్తీ

సాక్షిలో ప్రచురితమైన కథనం..



చెట్లు తొలగింపుతో శుభ్రంగా ఉన్న డిస్పెన్సరీ స్థలం

సాక్షి ఎఫెక్ట్..

నగరంపాలెం: ఈఎస్ఐ డిస్పెన్సరీ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు ఎట్టకేలకు తొలగించారు. ఇటీవల సాక్షిలో 'ఈఎస్ఐ డిస్పెన్సరీకి సుస్తీ' కథనం ప్రచురితమైంది. ఇందులో డిస్పెన్సరీ మినహా ఖాళీ ప్రదేశం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. పెద్ద వృక్షాలుగా మారి ఏపుగా మారడంతో పచ్చని పొలాలను తలపించాయి. డిస్పెన్సరీకి వచ్చే రోగులు, సహాయకులు, చుట్టు పక్కల ఉండే వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కథనంలో ప్రస్తావించాయి. దీంతో గత రెండు రోజులుగా పొక్లెయిన్ సహాయంతో పిచ్చిమొక్కలను తొలగింపు చర్యలు చేపట్టారు. క్వార్టర్స్ వద్ద పెద్ద ఎత్తున్న పెరిగిన చెట్లను కూడా తొలగించి, చదును చేశారు. ప్రస్తుతం ఖాళీస్థలం చక్కని మైదానంగా మారిపోయింది.

హోప్‌విన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



గుంటూరు మెడికల్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షల చేస్తున్న ముస్లింలకు స్థానిక గుంటూరువారితోట 7వ లైన్‌లో ఉన్న హోప్ విన్ హాస్పిటల్స్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వ్యవస్థాపకులు, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, చైర్మన్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో గ్రామీణ వైద్యులు, హోప్ విన్ హాస్పిటల్స్ వైద్యులు, గుంటూరు నగరానికి చెందిన వైద్యులు, రంజాన్ ఉపవాస దీక్షాపరులు, హోప్ విన్ హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలనే మంచి లక్ష్యంతో తమ హాస్పటల్ ఏర్పాటు చేశామన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొని ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఆకాంక్షించారు.

19న చలో విజయవాడ

గుంటూరు మెడికల్: ఏళ్ల తరబడి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శ్రమదోపిడీకి గురవుతున్నారని, పనికి తగ్గ జీతభత్యాలు చెల్లించడం లేదని పారా మెడికల్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజ్యాంగం యొక్క ప్రాథమిక హక్కులను ఉల్లంఘించి జీవో నంబర్ 2 ను విడుదల చేసిందన్నారు. అది సరైన పద్ధతి కాదని ఆప్కాస్‌లో పనిచేస్తున్న పారా మెడికల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీఓ నంబర్ 2 సవరించి మినిమం ఆఫ్ టైం స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 19వ తేదీ చలో విజయవాడ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వినియోగదారుల హక్కులపై వర్క్‌షాప్



విద్యార్థులతో ప్రిన్సిపాల్ గోపీచంద్, ఎస్సార్కే ప్రసాద్, నాగసుశీల

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై అవగాహనతో పాటు సమస్యలు, కల్తీ వస్తువులు, ఆహార పదార్థాలపై వర్క్‌షాప్, ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా పెంపుడు జంతువుల ఆహారం, డిజిటల్ ఆధారిత మోసాలు, బ్రాండెడ్, జనరిక్ మందులు, సైబర్ సెక్యూరిటీస్, దొంగనోట్లు, నిత్యావసర సరుకుల కల్తీ, వస్త్రాలు, బంగారు ఆభరణాల హాల్ మార్కింగ్, తూకంలో మోసాలు వంటి అంశాలపై ప్రదర్శన ఆకట్టుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడుతూ నిత్యం మనం వినియోగించే వస్తువులు, సామగ్రి నాణ్యత, మోసాలపై ఇటువంటి ప్రదర్శలు, వర్క్‌షాప్‌ల ద్వారా వినియోగదారులను చైతన్యపరచవచ్చునని తెలిపారు. ఈసందర్భంగా ప్రదర్శనలో ఉత్తమ ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులను తొలి మూడుస్థానాల్లో విజేతలుగా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు, ఆంగ్ల శాఖాధిపతి పి.నాగసుశీల, ఐక్యూఏసీ సమన్వయకర్త టి.బాల నరేంద్రప్రసాద్, ఐ.హట్టి, చరణ్‌చౌదరి, కె.అంజనా దేవి, వెంకటకృష్ణ, కె.వీణ, కె.అరుణకుమారి, యు.వెంకటేశ్వరరావు, కె.కల్పన పాల్గొన్నారు.

సకాలంలో అర్జీల పరిష్కారానికి కృషి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ సోమవారం నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్‌లో 21 మంది సమస్యలు విన్నవించారు. ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. డయల్ యువర్ కమిషనర్‌కు అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని ఆదేశించారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని కోరారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. 41 ఫిర్యాదులు రాగా వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 15, ఇంజినీరింగ్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 10, ప్రజారోగ్య విభాగానికి 5, ఉపాసెల్ విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డీసీపీ సూరజ్, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఉపాసెల్ పీఓ రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

మిర్చి కోరు రాకుండా చర్యలు..

నగరపాలక సంస్థ పరిధిలో మిర్చి తొడెమెలు తీసే గోడౌన్‌ల వ్యర్థాల వలన ప్రజలు మిర్చికోరుతో ఇబ్బందులు పడుతున్నారని పలు ఫిర్యాదులు అందుతున్నాయని, నిర్వాహకులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో కలసి చుట్టగుంట సెంటర్ నుంచి మిర్చి యార్డు వరకు పర్యటించారు. మిర్చి తొడెమెల గోడౌన్‌లను పరిశీలించి యాజమాన్యాలతో మాట్లాడి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు, నిర్వాహకులకు సూచనలు చేశారు. కొత్తకాలనీ మెయిన్ రోడ్ పై ఏర్పడిన పైప్‌లైన్ లీకును మరమ్మతులు చేపట్టాలని, ఎమినిటి కార్యదర్శులు ఎప్పటికప్పుడు సచివాలయం పరిధిలో లీకులను గుర్తించడం, మరమ్మతులు చేయించాలని కోరారు. అనంతరం మిర్చి యార్డు వద్ద నున్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈలు శ్రీనివాస్, మధుసూదన్, కార్పొరేటర్ పద్మావతి పాల్గొన్నారు.

సెల్లార్ పార్కింగ్‌కు బదులు వ్యాపారం


పీజీఆర్ఎస్‌లో కమిషనర్‌కు ఫిర్యాదు

నెహ్రూనగర్: నగరంలోని లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో ఓ షాపు యాజమాని అడ్డగోలుగా పార్కింగ్ ప్రదేశాన్ని ఆక్రమించి నూతనంగా షాపులు నిర్మాణం చేపట్టారని సోమవారం గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పఠాన్ మొహమాలిఖాన్, రామకృష్ణ ఫిర్యాదు చేశారు. నిత్యం రద్దీగా ఉండే గుంటూరు లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో ఆ షాపింగ్ కాంప్లెక్స్‌లో పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో వాహనాలు పెట్టనీయకుండా భవన యాజమాని నూతనంగా షాపుల నిర్మాణం చేపట్టారు. పార్కింగ్ ప్రదేశంలో ఈ షాపులను అడ్డగోలుగా ఆక్రమంగా ఏర్పాటు చేయడంతో పార్కింగ్ ప్రదేశం లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి సదరు ప్రాంతం అంతా జన సంచారం, వాహనాలతో ఎంతో రద్దీగా ఉంటుంది. సెల్లార్‌లో షాపులు నిర్మాణం చేపడుతున్నారని అనేక పర్యాయాలు ఫిర్యాదు చేయగా...టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి సెల్లార్లల్లో పార్కింగ్ కోసం కేటాయించిన ప్రదేశంలో చేపట్టిన ఆక్రమ నిర్మాణాలను తొలగించి వాహనాల పార్కింగ్‌కు తిరిగి ఆ స్థలాన్ని అప్పగించాలని కోరారు.

ఆర్ఐపై ఫిర్యాదు..

నెహ్రూనగర్: పన్ను విభజన చేసేందుకు ముడుపులు సమర్పించినప్పటికీ పన్ను మారకపోవడంపై బాధితురాలు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న పీజీఆర్ఎస్‌లో కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తారకరామనగర్‌కు చెందిన పాలెపోగు రమణ అదే ప్రాంతంలో 157 గజాల స్థలంలో వేరే వ్యక్తి వద్ద నుంచి పాలెపోగు రమణ 57 గజాలు రెండు సంవత్సరం క్రితం కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. గతంలో సదరు స్థలానికి ఇంటి పన్ను ఉంది. ప్రస్తుతం కొన్న స్థలం వరకు పన్ను బైఫర్‌కేషన్(పన్ను విభజన) చేయాలని గతంలో ఇక్కడ ఆర్ఐగా పనిచేసిన ఉద్యోగి డబ్బులు డిమాండ్ చేయడంతో రూ.60 వేలు దాకా సమర్పించుకున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా పన్ను మారకపోవడంతో పాటు గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్ఐ బదిలీ అయ్యారని మాకు పన్ను విభజన చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అక్రమంగా నిర్మిస్తున్న దుకాణం తొలగింపు



మనల్ని ఎవడ్రా ఆపేది...!

సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనం



రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న దుకాణాన్ని తొలగించిన పట్టణ ప్రణాళిక అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నెహ్రూ నగర్: కొత్తపేట క్లాత్ మార్కెట్ వద్ద రోడ్డును ఆక్రమించుకుని స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ అండదండలతో దుకాణం నిర్మిస్తున్నా పట్టణ ప్రణాళిక అధికారులు పట్టించుకోకపోవడంపై సాక్షిలో సోమవారం మనల్ని ఎవడ్రా ఆపేది...! అనే శీర్షిక ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పట్టణ ప్రణాళిక అధికారులు సోమవారం ఉదయం నాటికి దుకాణాన్ని పూర్తిగా పడగొట్టేశారు. ముందే అక్రమ కట్టడాలు జరగకుండా చూసి ఉంటే ఇంత దూరం వచ్చేది కాదు కదా అని పలువురు అధికారుల తీరును ఎండగడుతున్నారు.

కేర్ వెల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



భోజనం వడ్డిస్తున్న డాక్టర్ నాగూర్‌బాషా

గుంటూరు మెడికల్: రంజాన్ పండుగ సందర్భంగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, కేర్‌వెల్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ షేక్ నాగూర్ బాషా ఆధ్వర్యంలో స్థానిక పొన్నూరు రోడ్డు ముస్లిం కాలేజీలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వివిధ రాజకీయ పార్టీ నాయకులు, గుంటూరుకు చెందిన ప్రముఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు పార్టీల నేతలు, సీనియర్ వైద్యులు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లింలు అల్లాహ్ ఆశీస్సులు పొంది ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఉపవాస దీక్ష చేసే వారికి ఇఫ్తార్ విందు ఇవ్వడం వల్ల వారితో సమానంగా అల్లాహ్ నుంచి పుణ్యం లభిస్తుందని తెలిపారు. సుమారు 4500 మంది ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామని గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా తెలిపారు. హాస్పిటల్ ప్రారంభించిన దగ్గర నుంచి అనేక ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. వ్యాధులపై, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ సామాజిక సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేర్ వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్ బాషా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఎంటీఎంసీ కమిషనర్‌కు సత్కారం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కనకదుర్గ వారధి కింద ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా సోమవారం పర్యటించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసరాలను పరిశీలించారు. స్థానిక భవానీ జల శంకర ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కనకదుర్గ వారధి నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు.

ఆధార్ మొబైల్ క్యాంపులు

దుగ్గిరాల: మండలంలోని తొమ్మిది గ్రామాల్లో మార్చి 19 నుంచి 28వ తేదీ వరకు మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలోఆయన వివరాలు వెల్లడించారు. ఆధార్‌లో పేర్ల తప్పులు, చిరునామాలోని మార్పులు చేర్పులు ఆధార్ లేని చిన్న పిల్లలుకి కొత్తగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఆధార్ క్యాంపు అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

టీచర్ల సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరుజిల్లాలో 1994 నుంచి 2018 వరకు నిర్వహించిన డీఎస్సీలకు సంబంధించిన అన్ని కేడర్ల వారీగా ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మొహ్మద్ ఖాలీద్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకను కలిసి సీనియార్టీ జాబితాపై వివిధ అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బదిలీలు, ఉద్యోగోన్నతులను వివాదాలకు తావు లేకుండా జరిపేందుకు నిబంధనలు మేరకు సీనియారిటీ జాబితాలను ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయులు సీనియారిటీ జాబితా అందుబాటులో ఉంచాలన్నారు. 1994, 1996 డీఎస్సీల ద్వారా ఎంపికై, 2002 నవంబర్‌లో జరిగిన ఉద్యోగోన్నతుల్లో నష్టపోయిన స్కూల్ అసిస్టెంట్లు ఉద్యోగోన్నతి జాబితాను సవరించి 66 మంది స్కూల్స్ అసిస్టెంట్లకు నోషనల్ సీనియారిటీ జాబితా రూపొందించి న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా 2009 డీఎస్సీ ద్వారా హామీపత్రాలతో ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి పాఠశాలల్లో చేరిన తేదీని కామన్‌గా ఒకే తేదీని నిర్ణయించాలన్నారు.